జనం కోసం - మన అక్షరం

# అక్షర వెలుగు

TELTEL02057

www.aksharavelugu.com

తెలుగు దిన పత్రిక




బుధ వారం 16.11.22 | తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : పృథ్విరాజు. జి | సంపుటి - 01, సంచిక-114 | పేజీలు - 4 | వెల రూ. 5

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak

# తెలంగాణ వైద్యరంగంలో కొత్త చరిత్ర

## ఏక కాలంలో అందుబాటులోకి 8 వైద్య కళాశాలలు



- ప్రగతి భవన్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభం
- 850 నుంచి ఏకంగా 2,790కి పెరిగిన మెడికల్ సీట్లు
- రిమోట్ ద్వారా ప్రారంభించి అభినందించిన సిఎం కెసిఆర్
- మిగతా జిల్లాల్లో కూడా కాలేజీలను నిర్మిస్తామని ప్రకటన
- కాలేజీల ఏర్పాటుకు కృషి చేసిన వైద్యాధికారులకు అభినందనలు



**హైదరాబాద్, నవంబర్ 15 (అక్షర వెలుగు):** ఏకకాలంలో రాష్ట్రంలో ఎనిమిది మెడికల్ కాలేజీలు అందుబాటులోకి వచ్చాయి. జిల్లాకో మెడికల్ కాలేజీ నినాదంలో భాగంగా ప్రభుత్వ రంగంలో 8 కొత్త కాలేజీలను సిఎం కెసిఆర్ ఏకకాలంలో ప్రారంభించారు. రాష్ట్రంలో కొత్తగా నిర్మించిన ఏడు మెడికల్ కాలేజీకు రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ప్రారంభోత్సవం చేశారు. మంచిర్యాల, రామగుండం, జగిత్యాల, వనపర్తి, నాగర్‌కర్నూల్, మహబూబాబాద్, కొత్తగూడెం, సంగారెడ్డి మెడికల్ కాలేజీలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ కార్యక్రమంలో పాల్గొన్న అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర చరిత్రలో ఇదో సువర్ణ అధ్యాయంగా ప్రకటించారు. ఒకనాడు అనేక సమస్యలతో తాగు, సాగునీటికి,

3లో

# ఆటో డ్రైవర్ ప్రాణాల మీదకు తెచ్చిన టీఆర్ఎస్

## బాణాసంచా మీద పడడంతో మంటలతో ఆస్పత్రిపాలు

సంగారెడ్డి,నవంబర్ 15 (అక్షర వెలుగు): టీఆర్ఎస్ కార్యకర్తల అత్యుత్సాహం ఓ ఆటో డ్రైవర్ ప్రాణం మీదకు తెచ్చింది. పేలుడులో గాయపడ్డ అతడి పరిస్థితి సీరియస్ గా ఉంది. ఒళ్లంతా కాలిన గాయాలతో ఆస్పత్రి పాలయ్యాడు. సంగారెడ్డిలో ఈ విషాదం చోటుచేసుకుంది. ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్ర వ్యాప్తంగా కొత్త మెడికల్ కాలేజీల ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని టీఆర్ఎస్ కార్యకర్తలు సంగారెడ్డి మెడికల్ కాలేజీ ఓపెనింగ్ సందర్భంగా విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు.ఉదయం సంగారెడ్డితోపాటు 8 మెడికల్ కాలేజీలను కేసీఆర్ ప్రారంభించారు. హైదరాబాద్ ప్రగతి భవన్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వాటిని లాంఛనంగా అందుబాటులోకి తీసుకొచ్చారు. ఆన్ లైన్ విధానంలో తరగతులను ప్రారంభించారు. దీంతో ఇప్పటివరకూ ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాలల సంఖ్య 17కు పెరిగింది. కొత్త కళాశాలలు అందుబాటులోకి రావడంతో అదనంగా 1150 మంది విద్యార్థులకు వైద్యవిద్య అందనుంది. సంగారెడ్డిలో మెడికల్ కాలేజీ అందుబాటులోకి రావడంతో టీఆర్ఎస్ కార్యకర్తలు ఆనందోత్సాహాలను వ్యక్తం చేశారు. భారీ ఎత్తున బైక్ ర్యాలీని నిర్వహించారు. వైద్య కళాశాలల ప్రారంభోత్సవాన్ని పండుగలా జరుపుకున్నారు. ఈ సందర్భంగా భారీగా బాణాసంచాను కాల్చారు. అయితే ఇక్కడే అపశృతి చోటుచేసుకుంది. పేలిన బాణాసంచాలన్నీ అటుగా వెళు

3లో



# నింగికేగిన మరో ధృవతార సూపర్ స్టార్ కృష్ణ అస్తమయం



- మంచి మిత్రుడిని కోల్పాయాను
- కృష్ణ భౌతిక కాయం వద్ద సిఎం కెసిఆర్ నివాళి
- కుటుంబ సభ్యులకు పరామర్శ..
- మంత్రులు,ఎంపిలు నివాళి అర్పణ

**హైదరాబాద్, నవంబర్ 15 (అక్షర వెలుగు):** తానో మంచి మిత్రుడిని కోల్పోయానని కృష్ణ మృతిపై సిఎం కెసిఆర్ వ్యాఖ్యానించారు. కృష్ణ మంచి నటుడే గాకుండా, ఓ ఎంపిగా దేశానికి అద్భుత సేవ చేశారని, అల్లూరి సీతారామరాజు లాంటి దేశభక్తి సినిమాను తీసారని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నానక్‌రాంగూడలోని కృష్ణ నివాసానికి చేరుకుని సూపర్ స్టార్ కృష్ణ భౌతికకాయానికి కేసీఆర్ నివాళి అర్పించారు. మహేష్ బాబు, కృష్ణ కుటుంబ సభ్యులను ముఖ్యమంత్రి పరామర్శించారు. అనంతరం కేసీఆర్ మాట్లాడుతూ.. వ్యక్తిగతంగా మంచి మిత్రుడిని కోల్పోయానని ఆవేదన చెందారు. సుప్రసిద్ధ నటుడు కృష్ణ మన మధ్య లేకపోవడం బాధాకరమన్నారు. ముక్కుసూటిగా మాట్లాడే మనిషి కృష్ణ అని అన్నారు. పార్లమెంట్ సభ్యునిగా కూడా పనిచేశారు. కృష్ణ నటించిన అల్లూరి సీతారామరాజు సినిమాను చాలా సార్లు చూసినట్లు తెలిపారు. ప్రభుత్వ లాంఛనాలతో సూపర్ స్టార్ కృష్ణ అంత్యక్రియలు నిర్వహిస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ వెల్లడించారు. కెసిఆర్ వెంట మంత్రి హరీష్ రావు, మాజీ స్పీకర్ మధుసూధనాచారి, ఎంపి సంతోష్ కుమార్ తదితరులు ఉన్నారు. సూపర్ స్టార్ కృష్ణ పార్థివదేహానికి తెలంగాణ మంత్రి కేటీఆర్ నివాళులర్పించారు. నానక్‌రాంగూడలోని విజయకృష్ణ నివాసానికి చేరుకున్న కేటీఆర్.. అక్కడ కృష్ణ భౌతికకాయం వద్ద పూలు ఉంచి అంజలి ఘటించారు.

3లో



# మునుగోడు గొల్లకురుమలను నిండా ముంచారు

- నగదు బదిలీ చేసి..చివరకు అందకుండా చేశారు
- అప్పుడేమో డబ్బు అన్నారు..ఇప్పుడేమో గొర్రెలు అంటారా
- కెసిఆర్ అబద్ధాల పునాదులపై ప్రచారం చేస్తున్నారు
- మండిపడ్డ బిజెపి ఎంపి డాక్టర్ లక్ష్మణ్

3లో

# షెడ్యూల్ ప్రకారమే అసెంబ్లీ ఎన్నికలు


- పార్టీ మారాలనుకుంటే తస్మాత్ జాగ్రత్త
- అందరి కదలికలపైనా డేగకన్ను వేశాం
- ఎవరిపైనా ఒత్తిడి ఉంటే వెంటనే సమాచారం ఇవ్వాలి
- నా కూతురు కవితనే పార్టీ మారమని బిజెపికి ఒత్తిడి
- బిజెపి ట్రాప్‌లో పడొద్దని నేతలకు హెచ్చరికలు
- నియోజకవర్గాల్లో ఆత్మీయ సమావేశాలతో దూసుకుపోవాలి
- బిజెపిని ధీటుగా ఎదుర్కొనేలా సన్నద్ధం కావాలి
- పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో కెసిఆర్ ఘాటు హెచ్చరికలు
- ముందస్తు ఊహాగానాలకు కెసిఆర్ చెక్
- బిజెపి దూకుడుకు అడ్డుకట్ట వేయాల్సిందే
- ప్రభుత్వ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- ఇడి, ఐటి దాడులకు బెదరాల్సిన పనిలేదు
- పాతవారికే మళ్లీ టిక్కెట్లు ఇస్తామని ప్రకటన
- పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో సిఎం కెసిఆర్ స్పష్టీకరణ

3లో



# ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారం

- సిబిఐ విచారణను తిరస్కరించిన హైకోర్టు
- సిట్ విచారణ కొనసాగించాలని ఆదేశం
- సీల్డ్ కవర్‌లో నివేదిక అందించాలని సూచన



**హైదరాబాద్, నవంబర్ 15 (అక్షర వెలుగు):** ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో సీబీఐ విచారణకు హైకోర్టు నిరాకరించింది. సిట్ దర్యాప్తుపై తమకు నమ్మకం లేదని.. సీబీఐ లేదా ప్రత్యేక దర్యాప్తు సంస్థతో విచారణ జరిపించాలంటూ బీజేపీ నేత ప్రేమేందర్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్ పై విచారణ జరిపిన హైకోర్టు సిట్ దర్యాప్తును కొనసాగించాలని ఆదేశించింది. కేసుకు సంబంధించిన తుది నివేదికను సీల్డ్ కవర్‌లో హైకోర్టుకు అందించాలని ఉత్తర్వులు ఇచ్చింది. మొయినాబాద్ ఫాం హౌస్ కేసులో నిందితుల

3లో

# విదేశాలకు వెళ్లే విద్యార్థులకు శుభవార్త

## ఉక్రెయిన్, రష్యా లాంటి దేశాలకు వెళ్లే అవస్థలకు చెక్

## కొత్త కాలేజీల ఏర్పాటుతో అందుబాటులోకి సీట్లు

**హైదరాబాద్, నవంబర్ 15 (అక్షర వెలుగు):** కొత్తగా రాష్ట్రంలో అందుబాటులోకి వచ్చిన మెడికల్ కాలేజీల వల్ల డబ్బు ఖర్చు చేసుకొని విదేశాలకు వెళ్లే పేద విద్యార్థులకు అవస్థ తప్పుతుంది. ఉక్రెయిన్ వంటి విపత్తుల సమయంలో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని తిరిగి రావడం, చదువును కొనసాగించడానికి నానా కష్టాలు

3లో

# ఫలించిన నిజాం విద్యార్థుల పోరాటం

## యూజి విద్యార్థులకే కొత్త హాస్టల్ భవనం

## ప్రకటన విడుదల చేసిన కళాశాల ప్రిన్సిపాల్

**హైదరాబాద్, నవంబర్ 15 (అక్షర వెలుగు):** నిజాం కాలేజీ విద్యార్థుల పోరాటానికి ప్రభుత్వం దిగివచ్చింది. కొత్త హాస్టల్ ను పూర్తిగా యూజీ విద్యార్థులకే కేటాయించేందుకు గ్రీన్ సిగ్నల్

3లో

# మా బకాయి సొమ్ములు ఇవ్వండి

- లేదా జిఎస్టీని రద్దు చేయండి
- వీటి కోసం మీ పాదాలపై పడి బిచ్చమడగాలా
- మోడీ తీరుపై మండిపడ్డ మమతా బెనర్జీ



**కోల్‌కతా, నవంబర్ 15 (అక్షర వెలుగు):** కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సారథ్యంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి రావాల్సిన వస్తు సేవల పన్ను (జీఎస్టీ) బకాయిలు, వివిధ కేంద్ర పథకాల సొమ్ములు ఇవ్వడం లేదని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ విరుచుకుపడ్డారు. ఝార్‌గ్రామ్‌లో మంగళవారం జరిగిన గిరిజన కార్యక్రమంలో సీఎం మాట్లాడుతూ, 100 రోజుల ఉపాధి

3లో

# బిజెపి నేతలు ఈటెల,రాజగోపాల్‌లకు బిజెపి పిలుపు?

**హైదరాబాద్, నవంబర్ 15 (అక్షర వెలుగు):** బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి లకు బీజేపీ హైకమాండ్ నుంచి పిలుపువచ్చిందని ప్రచారం జరిగింది. దీంతో వారు ఇరువురు హుటాహుటిన ఢిల్లీకి బయలుదేరి వెళ్లారని అంటున్నారు. బీజేపీ అగ్రనేతలతో ఈటల, రాజగోపాల్‌రెడ్డి భేటీకానున్నారు. మోదీ సభ తర్వాత ఈటల, రాజగోపాల్‌కు హైకమాండ్ నుంచి పిలుపు రావడంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. కాగా.. మరో బీజేపీ నేత డీకే అరుణ ఇప్పటికే ఢిల్లీలో ఉన్న విషయం తెలిసిందే. అయితే అలాంటి పిలుపు ఏదీ లేదని ఎంపి లక్ష్మణ్ అన్నారు.

# సంపాదకీయం

## వైద్యరంగంలో కెసిఆర్ సంకల్పం అభినందనీయం !

తెలంగాణ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ చరిత్ర ఆవిష్కృతం అయ్యింది. వైద్య రంగంలో నూతన విప్లవం తీసుకుని వచ్చిన ఘనత కెసిఆర్‌దే. ఇప్పటికే వైద్యరంగాన్ని బలోపేతం చేయడంలో భాగంగా అస్పత్రులను తీర్చిదిద్ది సౌకర్యాలను కల్పిస్తూ వస్తున్న ప్రభుత్వం ఏకంగా ఎనిమిది కాలేజీలకు జీవం పోసింది. ప్రతి ప్రభుత్వాసుపత్రిలో పరీక్షలన్నీ జరిగేలా అధునాతన మిషినరీని ఏర్పాటు చేశారు. అధునా తన సాంకేతికి వ్యవస్థను అందుబాటులోకి తెచ్చారు. ప్రభుత్వాసుపత్రుల్లో వైద్య సౌకర్యాలను బాగా మెరుగు పరిచారు. ఈ క్రమంలోనే మన బిడ్డలు ఇక్కడే చదువుకుని వైద్యరంగంలో రాణించాలన్న సంకల్పాన్ని కెసిఆర్ చాటారనడం లో సందేహం మంగళవారం మధ్యాహ్నం సిఎం కెసిఆర్ చేతుల మీదుగా ఏకంగా 8 ప్రభుత్వ వైద్య కాలేజీలను ప్రారంభించడం అరుదైన చరిత్రగానే చెప్పుకోవాలి. దేశ చరిత్రలోనే ఒక అరుదైన సందర్భం.. ఒకేసారి ఎనిమిది ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రారంభం కాబోతున్న శుభసమయంలో కెసిఆర్ నిజంగానే అభినందనీయుడు. ఎనిమిదేండ్లలో ఎన్నో సంచలనాలు సృష్టించిన తెలంగాణ, మరో చారిత్రక ఘట్టానికి కూడా వేదిక కాబోతున్నదని నిరూపించారు. డబుల్ ఇంజిన్ సర్కార్ పేర ఎన్నో దాంబికాలు పలుకుతున్న బిజెపి నేతలకు ఈ అభివృద్ధి నమూనా కనువిప్పు కావాలి. ఇంతకాలం కెసిఆర్‌ను, ఆయన పాలనను తిట్టిపోయడం తప్ప ఒక్క మంచి పని కూడా చేయని వారికి ఇదో చెంపదెబ్బ. సింగరేణిని ప్రైవేట్ పరం చేసేపని మా చేతుల్లో లేదన్న ప్రధాని..వ్యాఖ్యలను గమనిస్తే వారిచేతుల్లో ఉంటే విశాఖ ఉక్కులాగా ఇప్పటికే అమ్మకానికి పెట్టేవారనడంలో సందేహం లేదు. అందుకే తెలంగాణ వస్తే ఏమొస్తుందని అనుకున్న వారికి అనేక కార్యక్రమాలను చేసి చూపించిన ఘనత సిఎం కెసిఆర్‌దే. డబుల్ ఇంజిన్ సర్కార్‌తో బురిడీ కొట్టిస్తూ..దేశ ప్రజలను వంచిస్తూ వచ్చిన బిజెపికి చెంపపెట్టులాంటి మార్పు కళ్లకు సాక్షాత్కారం అయ్యింది. బీబీనగర్ ఎయిమ్స్ కోసం పోరాడితే మంజూరు చేసిన కేంద్రం ఇప్పుడక్కడ కనీస వసతులను కూడా ఏర్పాటు చేయేలదన్న విమర్శలకు సమాధానం చెప్పాలి. కేంద్రం మంచి చేయదల్చుకుంటే ముందు బీబీనగర్ ఎయిమ్స్‌ను బలోపేతం చేసి సమస్యలను దూరం చేయాలి. ఇకపోతే ఉమ్మడి ఎపిలో మెడికల్ సీటు కోసం ఎంతగా తపించి....విదేశాలకు పోతున్న వారికి తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న కానుక కొత్త మెడికల్ కాలేజీలు అని చెప్పక తప్పదు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన ఎనిమిది వైద్య కళాశాలల్లో మంగళవారం నుంచి తరగతులు అందుబాటులోకి రావడం అన్నది ఒక అభివృద్ధి నమూనాకు సంకేతం. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు మధ్యాహ్నం 12 గంటలకు ప్రగతిభవన్ నుంచి వర్చువల్‌గా ఒకేసారి తరగతులను ప్రారంభించడం ద్వారా విద్యార్థులకు కొత్త ఆశలు కల్పించారు. ఇక్కడే తాము వైద్యవిద్యను అభ్యసించవచ్చన్న భరోసా కల్పించిన ఘనత కూడా కెసిఆర్‌దని చెప్పక తప్పదు. ఈ నిర్ణయంతో సంగారెడ్డి, మహబూబాబాద్, మంచిర్యాల,జగిత్యాల, వనపర్తి, కొత్తగూడెం, నాగర్ కర్నూలు, రామగుండం పట్టణాల్లోని 8 నూతన ప్రభుత్వ వైద్య కళాశాలలు అందుబాటులోకి వచ్చాయి. ఎంబీబీఎస్ తొలి విద్యాసంవత్సరం ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభం కావడం ద్వారా తెలంగాణ మనో మైలురాయిని చేరుకుంది. జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలన్న సీఎం కేసీఆర్ కలను సాకారం చేసే దిశగా అతిపెద్ద అడుగు పడింది. ఈ 8 కాలేజీలతో అదనంగా 1,150 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి వచ్చాయి. తెలంగాణ ఏర్పడేనాటికి రాష్ట్రంలోని మెడికల్ కాలేజీల సంఖ్య 5 మాత్రమే. ఇందులో గాంధీ (1954), ఉస్మానియా (1946) ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఆవిర్భవించేనాటికే ఉన్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో వరంగల్‌లో కాకతీయ మెడికల్ కాలేజీ, ఆదిలాబాద్‌లో రిమ్స్, నిజామాబాద్‌లో మరో వైద్య కళాశాలను మాత్రమే ఏర్పాటుచేశారు. దీంతో గ్రామీణ ప్రాంతాలకు మంచి వైద్యం, వైద్య విద్య అందని ద్రాక్షగా మారాయి. ఏదైనా పెద్ద వ్యాధి వచ్చినా, మెరుగైన వైద్యం పొందాలన్నా హైదరాబాద్‌కు పరిగెత్తాల్సిన దుస్థితి. వందల కిలోమీటర్ల దూరం.. గంటలపాటు ప్రయాణం చేయాల్సి వచ్చేది. అంత ప్రయాసపడి వచ్చినా.. చికిత్స కోసం వారాలు, నెలలపాటు అకడే ఉండాల్సిన పరిస్థితి ఉండేది. సరైన వసతులు లేక సహాయకులు అష్టకష్టాలుపడేవారు. దీంతో కుటుంబాలు ఆగమయ్యేవి. మరోవైపు.. ఐదు కాలేజీల్లో కలిపి 850 సీట్లు మాత్రమే ఉండేవి. దీంతో మెడిసిన్ చదువాలనుకున్న ఎంతోమంది విద్యార్థులు తమ కలలకు దూరమయ్యేవారు. మరికొందరు విదేశాలకు వెళ్లి రూ.లక్షలు ఖర్చు పెట్టి అప్పులపాలయ్యారు. ఈ క్రమంలో మెడికల్ కాలేజీల కోసం కేంద్రాన్ని అనేకమార్లు అభ్యర్థించారు. ఒక్క కాలేజీ అన్న మంజూరు చేయమని దేబిరించారు. కానీ కేంద్రం కనికరించలేదు. ఈ క్రమంలో స్వరాష్ట్రం ఏర్పడిన వెంటనే సూపర్ స్పెషాలిటీ సేవలను పేదలకు చేరువ చేయాలని నిర్ణయిం చుకొన్నారు. ఇందుకోసం జిల్లాకు ఒక వైద్య కళాశాలను ఏర్పాటుచేయాలని లక్ష్యంగా నిర్దేశించుకుని కార్యక్రమాన్ని పూర్తి చేశారు. నిజానికి సంకల్పం ఉండడం ఒక ఎత్తయితే..దానిని అమలు చేసి సాకారం చేయడం మరో ఎత్తు. ఇది ఆషామాషీ వ్యవహారం కాదు. మొదటి దశలో నాలుగు మెడికల్ కాలేజీలకు శ్రీకారం చుట్టిన కెసిఆర్ మహబూబ్‌నగర్, సిద్దిపేట, నల్లగొండ, సూర్యాపేటలో మెడికల్ కాలేజీలను ఏర్పాటుచేశారు. రెండోదశలో సంగారెడ్డి, మహబూబాబాద్, మంచిర్యాల, జగిత్యాల, వనపర్తి, భద్రాద్రి కొత్తగూడెం,నాగర్‌కర్నూలు, రామగుండంలో కాలేజీలను ఏర్పాటు చేశారు. ఎనిమిదేండ్లలోనే కాలేజీల సంఖ్య మూడున్నర రెట్లు పెరిగింది. ఉమ్మడి పాలనలో 57 ఏండ్లలో ప్రభుత్వాలన్నీ కలిపి తెలంగాణలో ఏర్పాటు చేసినవి మూడు కాలేజీలే. అంటే.. సగటున 19 ఏండ్లకు ఒక కాలేజీని ఏర్పాటు చేస్తే.. సీఎం కేసీఆర్ పాలనలో ఎనిమి దేండ్లలోనే 12 కాలేజీలు ఏర్పడ్డాయి. వచ్చే ఏడాది 9, ఆ పై ఏడాది మరో 8 మెడికల్ కాలేజీలను ప్రభుత్వం ఏర్పాటుచేయనున్నది. దీంతో జిల్లాకో మెడికల్ కాలేజీ కల సాకారం కాబోతున్నది. ఇది నిజంగా ఒక విప్లవాత్మకనిర్ణయంగానే చూడాలి. కాలేజీల ఏర్పాటులో పాటు మెడికల్ కాలేజీలో స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ విభాగాలు, అత్యాధునిక పరికరాలు ఉంటాయి. ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఎంబీబీఎస్ విద్యార్థులు, సీనియర్ రెసిండెంట్లు.. ఇలా భారీగా సిబ్బంది ఉంటారు. దీంతో ప్రజలకు మంచి వైద్యం అందుబాటులోకి వస్తుంది. పెద్ద వ్యాధి వచ్చినా హైదరా బాద్ వరకు పరిగెత్తాల్సిన అవసరం లేకుండా జిల్లా కేంద్రంలోనే చికిత్స లభిస్తుంది. జిల్లాల వికేంద్రీ కరణ నేపథ్యంలో మారుమూల గ్రామాలకు సైతం జిల్లా కేంద్రాలు గరిష్ఠంగా 50-70 కిలోమీటర్ల దూరంలోనే ఉన్నాయి. కాబట్టి అత్యవసర సమయాల్లో తొందరగా ఆస్పత్రికి చేరుకోవచ్చు.ఇలా వైద్య రంగంలో ఎనిమిది కాలేజీలను ఏర్పాటు చేసి, వాటికి సొంతంగా భవనాలను,నిర్మించి, సకల సదుపాయా లను కల్పించి ముందుకు వెళ్లడం అభినందనీయం. తెలంగాణ వైద్యారోగ్య రంగంలో ఇదో విప్లవంగా భావిస్తూ..ఇందుకు సంకల్పాన్ని చాటిన సిఎం కెసిఆర్ సర్వదా అభినందనీయుడని చెప్పాలి.

పృథ్వీరాజ్ గోసుకొండ
ఎడిటర్

# హైకోర్టు ఆదేశాలను స్వాగతించిన బిజెపి

### సిట్ విచారణలో పారదర్శకత ఉంటుందన్ననమ్మకం: బండి

**హైదరాబాద్,నవంబర్15(అక్షర వెలుగు):** నలుగురు ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారంపై హైకోర్టు సిట్టింగ్ జడ్జి పర్యవేక్షణలో సిట్ విచారణ జరపాలన్న హైకోర్టు నిర్ణయాన్ని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ స్వాగతించారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జారీ చేసిన ఉత్తర్వులపై సంతృప్తి వ్యక్తంచేశారు. సిట్టింగ్ జడ్జి పర్యవేక్షణలో సిట్ విచారణ జరపాలన్నదే బీజేపీ అభిమతమని బండి చెప్పారు. హైకోర్టు ఉత్తర్వులతో విచారణ పారదర్శకంగా జరిగే అవకాశముందని అభిప్రాయపడ్డారు. బీజేపీ ప్రతిష్టను దెబ్బతీసేందుకు టీఆర్ఎస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని బండి సంజయ్ ఆరోపించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ బీజేపీపై ఆరోపణలు చేస్తూ ప్రెస్ మీట్ నిర్వహించడమే ఇందుకు నిదర్శనమని అన్నారు. సీఎం ప్రెస్ మీట్ నిర్వహించడంపై హైకోర్టు ధర్మాసనం చేసిన వ్యాఖ్యలు అభినందనీయమన్నారు. తప్పు చేసినోళ్లకు, కుట్రదారులకు శిక్ష పడాల్సిందేనన్నారు. తెలంగాణ ప్రజలు కూడా కోరుకునేది ఇదే అని చెప్పారు. హైకోర్టు ధర్మాసనంపట్ల తమకు నమ్మకం ఉందన్నారు. వాస్తవాలు వెలుగులోకి వస్తాయని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారం వెనుక కుట్రదారులెవరన్నది తేలడంతో పాటు దోషులకు తగిన శిక్ష పడుతుందనే నమ్మకం ఉందని బండి సంజయ్ స్పష్టం చేశారు.

## రాష్ట్రంలో కొత్త మెడికల్ కాలేజీలు ఆనందం వ్యక్తం చేసిన కెటిఆర్

**హైదరాబాద్,నవంబర్15(అక్షర వెలుగు):** రాష్ట్రంలో ఆయా జిల్లాల్లో నూతనంగా నిర్మించిన 8 మెడికల్ కాలేజీలను ముఖ్యమంత్రి కేసీఆర్ ఆన్‌లైన్ ద్వారా ప్రారంభించడంపై సర్వత్రా ఆనందం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ ట్వీట్ చేశారు. మెడికల్ ఎడ్యుకేషన్, హెల్త్ సెక్టార్ రంగంలో తెలంగాణకు నేడు విశిష్టమైన దినం అని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ 8 మెడికల్ కాలేజీలను ప్రారంభిం చారని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 57 ఏండ్లలో కాలంలో తెలంగాణలో 3 మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేస్తే.. తెలంగాణ ప్రభుత్వం ఈ 8 ఏండ్లలో 12 మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. సందర్భంగా రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావుకు, ఆయన బృందానికి, డాక్టర్లకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. మెడికల్ రంగంలో కొత్తగా జర్నీని ప్రారంభించ బోతున్న విద్యార్థులకు విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఒక్కో జిల్లాల్లో ఒక్కో మెడికల్ కాలేజీని ఏర్పాటు చేస్తున్నామని, దాంతో పాటు 33 నర్సింగ్ కాలేజీలను కూడా అందుబాటులోకి తీసుకొస్తున్నామని చెప్పారు.

# సూపర్ స్టార్ కృష్ణ మృతికి సర్వత్రా దిగ్భ్రాంతి

## సంతాపం ప్రకటించిన గవర్నర్లు..సిఎంలు, మంత్రులు






**హైదరాబాద్,నవంబర్15(అక్షర వెలుగు):** సూపర్ స్టార్ కృష్ణ మృతి పట్ల తెలుగు రాష్ట్రాల్లోని సినీ, రాజకీయ ప్రముఖులు సంతాపం తెలిపారు. తెలుగు రాష్ట్రాల గవర్నర్లు తమిళిసై, బిశ్వభూషణ్ సంతాపం తెలిపారు. సూపర్‌స్టార్ కృష్ణ మరణం పట్ల ఏపీ గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ సంతాపం ప్రకటించారు. తెలుగు సినీ రంగానికి కృష్ణ అందించిన సేవలు మరవలేనివని అన్నారు. ఆయన మరణం అత్యంత విచారకరమని అన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతున్ని కోరుతూ కృష్ణ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఏపీ సీఎం జగన్, టీడీపీ అధినేత చంద్రబాబు తదితరులు సంతాపం తెలిపారు. సూపర్‌స్టార్ మరణంతో ఒక అద్భుత సినీశకం ముగిసినట్లయిందని వారు పేర్కొన్నారు. ముఖ్యమంత్రులు కేసీఆర్, జగన్, టీడీపీ అధినేత చంద్రబాబు, వెంకయ్యనాయుడు, పవన్‌కళ్యాణ్, లోకేష్, కేటీఆర్, రేవంత్‌రెడ్డి, శైలజానాథ్, సీపీఐ రామకృష్ణ, తులసిరెడ్డి, ఎలమంచలి శివాజీ సంతాపం తెలిపారు. అలాగే కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, మంత్రులు వేణుగోపాలకృష్ణ, తలసాని, ఎంపీలు రఘురామకృష్ణరాజు, కేశినేని శ్రీనివాస్, ఏపీ బీజేపీ చీఫ్ సోమువీర్రాజు, ఎమ్మెల్యే ఈటల రాజేందర్, టీడీపీ నేతలు సోమిరెడ్డి, కాసాని, రావుల, అర్విందకుమార్ గౌడ్, సీపీఐ నారాయణ సంతాపం ప్రకటించారు. సినీ ప్రముఖులు చిరంజీవి, జూనియర్ ఎన్టీఆర్, నాని, కృష్ణ మేకప్ మాన్ చేబ్రోలు మాధవరావు కృష్ణ మృతికి సంతాపం తెలియజేశారు. కాగా.. ఆదివారం అర్ధరాత్రి తీవ్ర అస్వస్థతకు గురైన కృష్ణను కుటుంబసభ్యులు కాంటినెంట్ హాస్పిటల్‌కు తరలించారు. కృష్ణ పరిస్థితి సీరియస్‌గా ఉండటంతో వైద్యులు ఐసీయూలో ఉంచి చికిత్స అందజేశారు. తెల్లవారుజామున కృష్ణ పరిస్థితి మరింతగా విషమించడంతో తుదిశ్వాస విడిచినట్లు వైద్యులు తెలిపారు.





# ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారం

(మొదటి పేజీ తరువాయి) బెయిల్ పిటిషన్‌ను నాంపల్లి ఏసీబీ కోర్టు ఇప్పటికే కొట్టివేసింది. ప్రభుత్వం తరపు లాయర్ వాదనలతో ఏసీబీ కోర్టు ఏకీభవించింది. దర్యాప్తు సమయంలో నిందితులకు బెయిల్ మంజూరు చేస్తే కేసును, సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందని పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనలు వినిపించారు. మరోవైపు ఇదే కేసులో నిందితుడిగా ఉన్న నందకుమార్ పై పోలీసులు పీటీ వారెంట్ కోరారు. ఈ మేరకు నాంపల్లి కోర్టులో బంజారాహిల్స్ పోలీసులు పీటీ వారెంట్ దాఖలు చేశారు. ఇదిలా ఉంటే.. నందకుమార్ పై బంజారాహిల్స్ పీఎస్ లో 2 కేసులు నమోదయ్యాయి. కేసు దర్యాప్తులో భాగంగా నిందితుడ్ని అరెస్ట్ చేసేందుకు అనుమతించాలని పోలీసులు కోరారు. ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో ఏ2గా ఉన్న నందకుమార్.. ఇప్పటికే చంచల్ గూడ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. పోలీసులు వేసిన పీటీ వారెంట్?కు నాంపల్లి కోర్టు అనుమతిస్తే.. నిందితుడు నందకుమార్ ను అరెస్ట్ చేసి తిరిగి కోర్టులో హాజరుపర్చనున్నారు. ఎంఎల్‌ఎల కొనుగోలు కేసుపై హైకోర్టులో బిజెపి ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్ రెడ్డి రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఎంఎల్‌ఎల కొనుగోలు కేసుపై సిట్ దర్యాప్తు కొనసాగించాలని హైకోర్టు తెలిపింది. తుది నివేదికను సీల్డ్ కవర్ లో హైకోర్టుకు సమర్పించాలని ఆదేశించింది. స్టేను కొనసాగించేలా ఆదేశాలివ్వాలని ధర్మాసానాన్ని ప్రేమేందర్ రెడ్డి కోరారు. సిట్ దర్యాప్తుపై తమకు నమ్మకం లేదని పిటిషనర్ పేర్కొన్నారు. సిబిఐ లేదా ప్రత్యేక దర్యాప్తు సంస్థతో విచారణ జరిపించాలని ప్రేమేందర్ రెడ్డి కోరారు. ఎంఎల్‌ఎల కొనుగోలు కేసును సిబిఐ విచారణకు హైకోర్టు అనుమతించలేదు. సిట్ చీఫ్ సివి ఆనంద్ నేతృత్వంలో దర్యాప్తు చేయాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల 29న నివేదికను కోర్టుకు సమర్పించాలని సిట్ కు ఆదేశాలు జారీ చేసింది. విచారణ వివరాలను మీడియా, రాజకీయ నాయకులకు వెల్లడించొద్దని సిట్‌కు హైకోర్టు పేర్కొంది.



# పార్టీ మారాలనుకుంటే తస్మాత్ జాగ్రత్త





- అందరి కదలికలపైనా డేగకన్ను వేశాం
- ఎవరిపైనా ఒత్తిడి ఉంటే వెంటనే సమాచారం ఇవ్వాలి
- నా కూతురు కవితనే పార్టీ మారమని బిజెపి ఒత్తిడి
- బిజెపి ట్రాప్‌లో పడొద్దని నేతలకు హెచ్చరికలు
- నియోజకవర్గాల్లో ఆత్మీయ సమావేశాలతో దూసుకుపోవాలి
- బిజెపిని ధీటుగా ఎదుర్కొనేలా సన్నద్ధం కావాలి
- పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో కెసిఆర్ ఘాటు హెచ్చరికలు

**హైదరాబాద్,నవంబర్15(అక్షర వెలుగు):** తన కుమార్తె కల్వకుంట్ల కవితను పార్టీ మారమని భారతీయ జనతా పార్టీ నేతలు అడిగారని, ఇంతకంటే దౌర్భాగ్యం ఇంకేమైనా ఉందా అని తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు వ్యాఖ్యానించారు. బిజెపి వ్యవస్థలను నాశనం చేయడమేగాకుండా, ప్రాంతీయపార్టీల ప్రభుత్వాలను అస్థిర పరచే కుట్రలకు తెరతీసిందన్నారు. తెలంగాణ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర సమితి సమావేశంలో కేసీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రాంతీయ పార్టీలపై బీజేపీ సర్కార్ కుట్రలు చేస్తోందని కేసీఆర్ ఆరోపించారు. దాదాపు 2 గంటల పాటు వివిధ అంశాలపై చర్చించారు. తాజా రాజకీయ పరిణామాలు, మునుగోడు ఫలితాలపై పోస్టు మార్టం, రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రజా ప్రతినిధులకు దిశానిర్దేశం చేశారు. ఫాం హౌస్ ఇష్యూతో సంబంధమున్న నలుగురు ఎమ్మెల్యేలను కేసీఆర్ ప్రశంసలతో ముంచెత్తినట్లు తెలుస్తోంది. ఐటీ,ఈడీ,సీబీఐ దాడులకు భయపడాల్సిన అవసరంలేదని తేల్చి చెప్పారు. పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో సీఎం అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి స్పష్టత ఇచ్చినట్లు తెలుస్తోంది. ముందస్తు ముచ్చటేలేదని, షెడ్యూల్ ప్రకారమే ఎన్నికలు జరుగుతామని తేల్చి చెప్పినట్లు సమాచారం. బీజేపీని ధీటుగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని నేతలకు పిలుపునిచ్చారు. ఎమ్మెల్యేలు, నేతలంతా నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండాలని పక్క పార్టీ నేతలతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. టీఆర్ఎస్ నేతలతో ఇతర పార్టీలకు చెందిన వారు ఎవరు టచ్ లోకి వచ్చినా తనకు సమాచారం ఇవ్వాలని సీఎం కేసీఆర్ చెప్పినట్లు తెలుస్తోంది. తన బిడ్డ కవితను కూడా పార్టీ మారమని అడిగారంటే ఇంతకన్నా ఘోరం ఉంటుందా అని ప్రశ్నించారు. బీజేపీలో చేరాలని ఒత్తిడి తెస్తే ఆ విషయం తన దృష్టికి తేవాలని, ఒకవేళ చెప్పకపోయినా తనకు తెలిసిపోతుందని అన్నారు. టీఆర్ఎస్ నేతలు పార్టీ మారాలని చూస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని కేసీఆర్ వార్నింగ్ ఇచ్చారు. ప్రతి ఎమ్మెల్యే ఏం చేస్తున్నాడన్నది తనకు తెలిసిపోతుందని అందుకే జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఏమైనా సమస్యలుంటే మంత్రి కేటీఆర్‌కు గానీ ప్రగతి భవన్‌కు గానీ వచ్చి చెప్పుకోవాలని చెప్పినట్లు సమాచారం. కేంద్రానికి ఏపీ సీఎం జగన్ అనుకూలంగా ఉన్నా.. వైసీపీని దెబ్బతీసేందుకు బీజేపీ కుట్రలు పన్నుతోందని అన్నారు. ఇంతకంటే ఘోరం ఎక్కడైనా ఉంటుందా అని కేసీఆర్ ప్రశ్నించారు. ఎమ్మెల్యేలపై పార్టీ మారాలని ఒత్తిడి చేస్తున్నారని... ఎవరెవరు ఏం చేస్తున్నారో ఎవరితో మాట్లాడుతున్నారో తనకు అన్నీ తెలుసని, జాగ్రత్తగా ఉండాలని కేసీఆర్ సూచించారు. ఎవరూ బీజేపీకి లొంగవద్దని, సమావేశం వివరాలు ఎక్కడ బయటకు చెప్పొద్దని కేసీఆర్ నేతలకు స్పష్టం చేశారు. అందరిపై నిఘా ఉందని కేసీఆర్ చెప్పారు. రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యేలను మార్చే ప్రసక్తే లేదని, ఈసారి కూడా సిట్టింగ్‌లకే టికెట్లు ఇస్తామని కేసీఆర్ స్పష్టం చేశారు. సమావేశంలో కేసీఆర్ మునుగోడు ఫలితాలపై కూడా సమీక్ష జరిపారు. మునుగోడు లో సరిగ్గా పనిచేయని మంత్రులకు క్లాస్ తీసుకున్నారు. కనీసం ఐదుగురు మంత్రులు ఇంఛార్జ్‌లుగా ఉన్న ప్రాంతాల్లో బీజేపీ అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మెజార్టీ వచ్చింది. మునుగోడు ఉప ఎన్నికల్లో రాజగోపాల్ రెడ్డికి 85వేలకు పైగా ఓట్లు వచ్చాయి. టీఆర్ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి కేవలం 10వేల మెజార్టీతో గెలవడంతో... తమకు మెజార్టీ ఇంత స్థాయిలో తగ్గుతుందని హించలేకపోయామని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ఫలితాలు వెలువడిన రోజే ప్రకటించారు. మునుగోడు ఉప ఎన్నికల ద్వారా బీజేపీ రోజురోజుకూ బలపడుతోందని రుజువైంది. దీంతో రెండు పార్టీల మధ్య రాష్ట్ర వ్యాప్తంగా నువ్వా నేనా అనే వాతావరణం ఏర్పడిందని పరిశీలకులు చెబుతున్నారు. మునుగోడులో కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్లు కూడా దక్కలేదు. ఈ క్రమంలో వచ్చే ఎన్నికలకు సంబంధించి పార్టీ నేతలు ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించాలని టీఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశంలో ముఖ్యమంత్రి కేసీఆర్ స్పష్టం చేశారు. ఆత్మీయ సమ్మేళనాల్లో మంత్రులు పాల్గొనాలని కేసీఆర్ అన్నారు. నియోజకవర్గ అభివృద్ధి నివేదిక రూపొందించుకోవాలని, మంత్రులు ఎమ్మెల్యేల గెలుపు బాధ్యత తీసుకోవాలని కేసీఆర్ తెలిపారు. 100 ఓటర్లకు ఒక ఇన్‌చార్జ్‌ను నియమించాలని, 5 రోజుల పాటు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తా మని కేసీఆర్ వెల్లడించారు. పోడుభూముల సమస్యలు పూర్తిగా పరిష్కరిస్తామని కేసీఆర్ చెప్పారు. ఇక నుంచి ధరణి సమస్యలు రాకుండా చర్యలు తీసుకుంటామని సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు. ప్రతి నియోజకవర్గంలో 500 మందికి దళితబంధు ఇస్తామని కేసీఆర్ పేర్కొన్నారు. బీజేపీతో ఇకపై యుద్ధమేనని సీఎం కేసీఆర్ అన్నారు. రానున్న 10 నెలలు చాలా కీలకమని, పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కష్టపడాలని సూచించారు.

# మునుగోడు గొల్లకురుమలను నిండా ముంచారు

(మొదటి పేజి తరువాయి) హైదరాబాద్,నవంబర్15(అక్షర వెలుగు): తెలంగాణలో టీఆర్ఎస్ పార్టీ అబద్దాల పునాదుల మీద రాజకీయం పబ్బం గడుపుతోందని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ అన్నారు. రాష్ట్రంలో కుల వృత్తుల మీద ఆధారపడే వారిని మోసం చేస్తున్నాడని చెప్పారు. మునుగోడులో గొల్లకురుమలను ఘోరంగా మోసం చేశారని మండిపడ్డారు. కేసీఆర్ అబద్దాలకు మారుపేరుగా మారిపోయాడని విమర్శించారు. మునుగోడు ఎన్నికల సందర్భంగా గొర్రె కాపరులకు నగదు బదిలీ చేస్తామని హామీ ఇచ్చారని, ఎన్నికల సందర్భంగా డబ్బులు వేసి ..వాటిని ఫ్రీజ్ చేయించాడని ఆరోపించారు.ఇప్పుడేమో నగదు బదులుగా గొర్రెలు ఇస్తామని అంటున్నారని మండిపడ్డారు. మునుగోడులో నాలుగువేల కుటుంబాలను సీఎం కేసీఆర్ దగా చేశాడని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా మూడు నాలుగు లక్షల మందికి గొర్రెల పంపిణీ జరగలేదని, చేనేత వృత్తులను కూడా అవమాన పరుస్తున్నాడన్న ఆయన... రాష్ట్రంలో చేనేత వృత్తులపై జీఎస్టీ శాతం ఎందుకు తగ్గించట్లేదో కేటీఆర్ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రధాని రాష్ట్ర పర్యటన సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ ముఖం చాటేసా డని లక్ష్మణ్ కామెంట్ చేశారు. ఎరువుల ఫ్యాక్టరీ వల్ల తెలంగాణలో ఆరులక్షల మంది రైతులకు లాభం చేకూరుతుందన్నారు. సింగరేణినీ ప్రైవేటీకరణ చేసిందంటూ కేంద్రంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నార న్న ఆయన.. సింగరేణి ప్రైవేటీకరణ చేసేది లేదని స్వయంగా ప్రధానే చెప్పారని గుర్తు చేశారు. 49 శాతం కేంద్రం వాటా, 51 శాతం రాష్ట్ర వాటా ఉంటే ఎలా ప్రైవేటీకరణ చేస్తారని ప్రశ్నించారు. సింగరేణిలో గత ఎనిమిదేళ్లలో ఒక్క ఉద్యోగమైనా కేటాయించారా అన్న లక్ష్మణ్.. సింగరేణిలో గత ఎనిమిది నెలల 20 వేల ఉద్యోగాలు తగ్గాయని చెప్పారు. రాజకీయ ప్రయోజనం కోసం లబ్దికోసం పిచ్చిపిచ్చి ఆరోపణలు చేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు పెద్ద పీట వేస్తోందని తెలిపారు. ఇదిలావుంటే అధిష్టానం నుంచి తెలంగాణ నేతలకు ఎలాంటి పిలుపు లేదని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ స్పష్టం చేశారు. ప్రత్యేకంగా తెలంగాణ నేతలతో ఎలాంటి సమావేశం షెడ్యూల్ చేయలేదన్న ఆయన.. నిన్న, మొన్న పార్టీ ఫ్రంటల్ ఆర్గనైజేషన్స్ తో సమావేశాలు జరిగాయని చెప్పారు. పార్టీ సంస్థాగత కార్యక్రమాలు మాత్రం జరుగు తున్నాయన్న ఆయన.. ఢిల్లీ మున్సిపల్ ఎన్నికల్లో ప్రచారం నిమిత్తం తెలుగు నేతలను పిలిచి బాధ్యతలు అప్పగించే అవకాశం ఉందని వివరించారు. సినీ నటుడు కృష్ణ మరణం తెలుగు సినిమాకు తీరని లోటని లక్ష్మణ్ అన్నారు. సూపర్ స్టార్ కృష్ణ మరణం తెలుగు సినిమాకు తీరనిలోటని బీజేపీ ఎంపీ డా. లక్ష్మణ్ అన్నారు. మూడు తరాల నటుడు.. అల్లూరి సీతారామరాజు అంటే గుర్తు చేసుకుంటారన్న ఆయన.. వారి కుటుంబానికి ఆత్మస్థైర్యం ఇవ్వాలని, కృష్ణ గారి ఆత్మకు శాంతి జరగాలని కోరుకుంటున్నానని చెప్పారు.



# నింగికేగిన మరో ధృవతార

(మొదటి పేజి తరువాయి) మహేష్ బాబు, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. అనంతరం అంత్యక్రియలకు సంబంధించిన ఏర్పాట్ల గురించి ఆరా తీశారు. 350కి పైగా సినిమాల్లో నటించిన కృష్ణ తెలుగు సినీ ప్రేక్షకుల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని మంత్రి కేటీఆర్ అన్నారు. కేవలం నటుడిగానే కాకుండా దర్శకుడిగా, నిర్మాతగా ఆయన తెలుగు సినీ రంగానికి ఎనలేని సేవలు చేశారని కొనియాడారు. తెలుగు సినిమా చరిత్రలో విభిన్న తరహా పాత్రలను పోషించడంతోపాటు, అద్భుతమైన సినిమాలను నిర్మించి తెలుగు సినిమా చరిత్రలో తనదైన స్థానాన్ని సృష్టించుకున్నారన్నారు. ఆయన మరణం తెలుగు చిత్ర పరిశ్రమకే కాకుండా.. ఘట్టమనేని కుటుంబ సభ్యులకు తీరని లోటన్నారు. కృష్ణ మృతి పట్ల రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. హీరోగా, నిర్మాతగా, దర్శకుడిగా, పద్మాలయ స్టూడియోస్ అధినేతగా, తెలుగు చలనచిత్ర పరిశ్రమకు ఐదు దశాబ్దాలకు పైగా ఆయన విశేష సేవలందించారని తన సంతాప సందేశంలో ఎంపీ రవిచంద్ర పేర్కొన్నారు. సుమారు 350 పైగా సినిమాలలో నటించి, వినూత్న సాంకేతిక పద్ధతులను ప్రవేశపెట్టి ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేసిన కృష్ణ అకాల మరణం తెలుగు చలనచిత్ర పరిశ్రమకు, ఆయన అభిమానులకు తీరని లోటని ఎంపీ వద్దిరాజు అన్నారు. ఈ ఏడాది ఆరంభంలో కుమారుడు రమేష్ బాబు, ఇటీవలే భార్య ఇందిరాదేవీ కన్నుమూయడం తీవ్ర బాధాకరమన్నారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, కుమారుడు, ప్రముఖ హీరో మహేష్ బాబుకు, కుటుంబ సభ్యులకు రవిచంద్ర తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# షెడ్యూల్ ప్రకారమే అసెంబ్లీ ఎన్నికలు



(మొదటి పేజి తరువాయి) హైదరాబాద్, నవంబర్ 15 (అక్షర వెలుగు): తెలంగాణలో యధావిధిగా షెడ్యూల్ ప్రకారమే ఎన్నికలు జరుగు తాయని సిఎం కెసిఆర్ స్పష్టం చేశారు. ముందస్తు ఊహాగానాలను కెసిఆర్ కొట్టి పడేశారు. టీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీ ఎన్నికలపై స్పష్టత ఇచ్చారు. షెడ్యూల్ ప్రకారమే అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయని స్పష్టం చేశారు. ముందస్తు ఎన్నికలకు వెళ్లే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. పార్టీ శ్రేణులంతా ఎన్నికలకు సిద్ధం కావాలన్నారు. అలాగే ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే అంశంపై చర్చించారు. ప్రజల మధ్యలోనే ఎమ్మెల్యేలు, నేతలు ఉండాలని సీఎం సూచించారు. మళ్లీ పాత వాళ్లకే టికెట్లు ఇస్తామని కేసీఆర్ స్పష్టం చేశారు. ఎన్నికలకు పది నెలల సమయమే ఉంది. బీజేపీతో పోరాడాల్సిందే అని చెప్పారు. ఎమ్మెల్యేలను మార్చే ప్రసక్తే లేదని కేసీఆర్ స్పష్టం చేశారు. ఎన్నికలకు ఏడాది కాలం ఉందని గట్టిగా పోరాడాలని నేతలకు సూచించారు. రానున్న 10 నెలలు చాలా కీలకమని, టీఆర్ఎస్ నేతలంతా ప్రజల్లో ఉండాలని, ఎమ్మెల్యేలు నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండాలని కేసీఆర్ సూచించారు. ఇకపై బీజేపీ మరింత రెచ్చిపోతుందని, ఆ పార్టీతో ఇక యుద్ధమేనని కేసీఆర్ స్పష్టం చేశారు. టీఆర్ఎస్ పార్టీ నేతలు ఇకపై మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బీజేపీ ఇబ్బందులు పెట్టే ప్రయత్నాలు చేస్తోందన్నారు. అనవసర విషయాల జోలికి వెళ్లవద్దని నాయకులకు కేసీఆర్ సూచించారు. వివాదాస్పద విషయాల్లో తలదూర్చవద్దని స్పష్టం చేశారు. ఐటీ, సీబీఐ, ఈడీలకు భయపడాల్సిన అవసరం లేదన్నారు. ఇటీవల జరిగిన మునుగోడు ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి గెలవడంతో టీఆర్ఎస్ ముందస్తు ఎన్నికలకు వెళ్లవచ్చని ప్రచారం జరిగింది. ఏడాది ముందే ఎన్నికలకు కేసీఆర్ సిద్ధమౌతారని ఊహాగానాలు వెలువడ్డాయి. అయితే ఈ ఊహాగానాలకు, పుకార్లకు కేసీఆర్ చెక్ పెట్టారు. ఏడాది తర్వాతే, షెడ్యూల్ ప్రకారమే ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయించారు. ఇటీవలి మునుగోడు ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి 85వేలకు పైగా ఓట్లు వచ్చాయి. కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి కేవలం 10వేల మెజార్టీతో గెలవడంతో... తమకు మెజార్టీ ఇంత స్థాయిలో తగ్గుతుందని ఊహించలేకపోయామని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ఫలితాలు వెలువడిన రోజే ప్రకటించారు. మునుగోడు ఉప ఎన్నికల ద్వారా బీజేపీ రోజురోజుకూ బలపడుతోందని రుజువైంది. దీంతో రెండు పార్టీల మధ్య రాష్ట్ర వ్యాప్తంగా నువ్వా నేనా అనే వాతావరణం ఏర్పడిందని పరిశీలకులు చెబుతున్నారు. మునుగోడులో కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్లు కూడా దక్కలేదు. విస్తృత సమావేశానికి ఎంపిలు, ఎమ్మెల్యేలు, మంత్రులు తదితరులు హాజరయ్యారు.

# విదేశాలకు వెళ్లే విద్యార్థులకు శుభవార్త



(మొదటి పేజి తరువాయి) పడాల్సిన దుస్థితి తప్పుతుంది. హాయిగా సొంత రాష్ట్రంలోనే ఉంటూ ఉచితంగా తమ కలలను నెరవేర్చుకోవచ్చు. ఎంబీబీఎస్ సీట్లు 2014లో 850 ఉండగా కొత్త మెడికల్ కాలేజీల ఏర్పాటుతో 2,790కి చేరింది. అంటే ఎనిమిదేండ్లలో మూడు రెట్లు పెరిగాయి. పీజీ సీట్లు డబుల్ అయ్యి 531 నుంచి 1,122 కు పెరిగాయి. సూపర్ స్పెషాలిటీ సీట్లు సైతం 76 ఉండగా రెట్టింపయ్యి 152కు చేరుకున్నాయి. దీంతో రాష్ట్ర విద్యార్థులు స్థానికంగా చదువుకొనే అవకాశాలు పెరిగాయి. ÷డికల్ కాలేజీ అంటే కేవలం విద్యాసంస్థ మాత్రమే కాదు. అనుబంధంగా అనేక వసతులు ఏర్పడుతాయి. ఆ ప్రాంతం ఆర్థిక కార్యకలాపాలకు కేంద్రంగా మారుతుంది. కాలేజీకి అనుబంధంగా హాస్పిటల్ అందుబాటులోకి వస్తుంది. వీటిల్లో పనిచేయ డానికి భారీగా సిబ్బంది అవసరం ఉంటారు. దీంతో స్థానికులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి పెరుగు తుంది. విద్యార్థులు, డాక్టర్లు, సిబ్బంది, హాస్పిటల్‌కు వచ్చే రోగులు, సహాయకులు.. వారికోసం రవాణా, వసతి సదుపాయాలు.. ఇలా ఆ ప్రాంతంలో ఆర్థిక కార్యకలాపాలు పెరిగి అభివృద్ధి చెందుతుంది. ÷లంగాణ ఏర్పడేనాటికి రాష్ట్రంలో ఐదు మెడికల్ కాలేజీలు మాత్రమే ఉండేవి. ఎనిమిదేండ్లలోనే 12 కొత్త కాలేజీలు ఏర్పాటు చేసుకొన్న ఘనత తెలంగాణ రాష్ట్రం సొంతం. ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ చొప్పున 33 జిల్లాలకు కాలేజీలు వస్తాయి. అప్పుడు రాష్ట్రంలో 10 వేల ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి వస్తాయి. అప్పుడు ఇక్కడి విద్యార్థులు వైద్య విద్యకోసం రష్యా, చైనా, ఉక్రెయిన్ వంటి దేశాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. రాష్ట్రంలోనే చదివేందుకు సరిపడా సీట్లు అందుబాటులో ఉంటాయి. రాష్ట్రంలో ఒకేసారి 8 ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో తరగతులు ప్రారంభం కావడం, పిల్లలకు 1,150 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి రావడం దేశ చరిత్రలోనే బహుశా తొలిసారి.ఈ 8 కాలేజీల నిర్మాణానికి కృషి చేసిన హెల్త్ సెక్రటరీ, డీఎంఈ, ఆయా కాలేజీల ప్రిన్సిపాళ్లు, ఇతర అధికారులకు కెసిఆర్ ప్రత్యేక అభినందనలు తెలిపారు. డబుల్ ఇంజిన్ సర్కార్‌గా గొప్పలు చెప్పుకునే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సాధించని ఘనతగా దీనిని చూడాలి. ఏ అంశంలోనూ తెలంగాణ రాష్ట్రంతో సరితూగడం లేదు.

# మా బకాయి సొమ్ములు ఇవ్వండి

(మొదటి పేజి తరువాయి) హామీ పథకం నిధులు తప్పనిసరి అని, దీనిపై ఏడాది క్రితం ఢిల్లీ వెళ్లి ప్రధానమంత్రిని కలుసుకున్నానని చెప్పారు. ఇంతకంటే ఏమి చేయాలి? నేను మీ పాదాలపై పడి బిచ్చమడగాలా? అని ప్రధానిని ఉద్దేశించి మమత ఘాటు వ్యాఖ్యలు చేశారు. మనం ప్రజాస్వామ్యంలో ఉన్నామా? లేక భారతదేశం ఏక పార్టీ దేశంగా మారిందా? అని మమత ప్రశ్నించారు. మాకు మీరు బకాయి పడ్డ సొమ్ములు ఇవ్వండి. అది మా సొమ్ము. లేదంటే జీఎస్టీని రద్దు చేయండి. 100 రోజుల ఉపాధి హామీ పథకం డబ్బులు చెల్లించండి. లేదా కుర్చీ దిగిపోండి అని సీఎం అన్నారు. బెంగాల్‌కు నిధులు ఆపేస్తామంటూ బెదిరిస్తున్నారనీ, అప్పుడు తాము కూడా జీఎస్టీ ఆపేస్తామని ఆమె తెగేసి చెప్పారు. మీరు ఇక్కడ పన్నులు వసూలు చేయలేరు. మాకు చట్టబద్ధంగా రావాల్సిన బకాయిలు తొక్కిపెట్టలేరు. బెంగాల్ ప్రజలకు చట్టబద్ధంగా రావాల్సిన బకాయిలను ఎంతమాత్రం మీరు నిరాకరించలేరని సీఎం అన్నారు. అవినీతిని దృష్టిలో ఉంచుకునే వివిధ పథకాల కింద పశ్చిమబెంగాల్‌కు ఇవ్వాల్సిన నిధులను కేంద్రం నిలిపివేసిందని బీజేపీ నేత సువేందు అధికారి చేసిన వ్యాఖ్యలపై మమత మండిపడ్డారు. బెంగాల్ ప్రజలను ఇలాగే అవమానిస్తూ పోతే ఏదో ఒక రోజు ఇలాంటి రాజకీయనేతలు జీరో అవుతారని హెచ్చరించారు. 100 రోజుల పని పథకం కానీ, గ్రామీణ సడక్ యోజన కానీ, బెంగాల్ ఆవాస్ యోజన కానీ.. పథకం ఏదైనా అగ్ర రాష్ట్రాల జాబితాలో పశ్చిమబెంగాల్ ఉంటుందని చెప్పారు.



# ఫలించిన నిజాం విద్యార్థుల పోరాటం

(మొదటి పేజి తరువాయి) ఇచ్చింది. ఈ మేరకు నిజాం ప్రిన్సిపాల్ ప్రకటన విడుదలచేశారు. హాస్టల్లో 100శాతం వసతి యూజి విద్యార్థులకే కేటాయిస్తామని స్పష్టం చేశారు. హాస్టల్ ఫెసిలిటీ కోసం యూజీ సెకండ్, థర్డ్ ఇయర్ స్టూడెంట్స్ ఈ నెల 19లోపు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రకటించారు. అంతకు ముందు నిజాం కాలేజ్ విద్యార్థినులతో మాట్లాడిన మంత్రి సబితా ఇంద్రారెడ్డి.. వారి సమస్యలను తెలుసుకున్నారు. హాస్టల్ వసతి విషయంలో ఓయూ వీసీ, నిజాం ప్రిన్సిపాల్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులతో చర్చలు జరిపి వారి సమస్యలను పరిష్కరించాలని ప్రిన్సిపాల్?కు మంత్రి సబిత ఆదేశాలు జారీ చేశారు. హాస్టల్ కోసం చేస్తున్న పోరాటం ఫలించడంతో నిజాం విద్యార్థినులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దాదాపు 15 రోజులుగా వారు కాలేజీ ఆవరణలో బైఠాయించి నిరసనలు తెలిపారు. ఇంతకు ముందు హాస్టల్ లో 50 శాతం యూజీ, 50 శాతం పీజీ విద్యార్థులకు కేటాయించాలని నిర్ణయించారు. దీనిపై విద్యార్థినులు అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఆందోళనను కొనసాగించారు. నిరసనలు ఉధృతం కావడంతో విద్యాశాఖ మంత్రి సబితా ఈ విషయాన్ని సీరియస్ గా తీసుకున్నారు. మరోసారి విద్యార్థులతో మాట్లాడి వారికి హామీ ఇచ్చారు. విద్యాశాఖ ఆదేశాలతో వందశాతం హాస్టల్ ను విద్యార్థులకు కేటాయించేందుకు నిజాం ప్రిన్సిపాల్ అంగీకరించారు.

# తెలంగాణ వైద్యరంగంలో కొత్త చరిత్ర




(మొదటి పేజి తరువాయి) కరెంటు, మెడికల్ సీట్లు, ఇంజినీరింగ్ సీట్లకు ఎన్నో రకాల అవస్థలు పడ్డ తెలంగాణ ప్రాంతం స్వరాష్ట్రమై అద్భుతంగా ఆత్మగౌరవంతో బతుకుతూ దేశానికే మార్గదర్శక మైనటువంటి అనేక వినూత్న కార్యక్రమాలు చేపడుతూ ముందుకెళ్తున్నదని అన్నారు. మనం ఇవాళ ఎనిమిది కళాశాలలను ప్రారంభించుకోవడం అందరికీ గర్వకారణం అని కెసిఆర్ అన్నారు. గతంలోనే మనం ప్రభుత్వరంగంలో నాలుగు కళాశాలను స్థాపించుకున్నాం. మహబూబ్‌నగర్, సిద్ధిపేట, నల్గొండ, సూర్యాపేట లో గతంలో నాలుగు ప్రారంభించాం. అవన్నీ మెడికల్ ఎడ్యూకేషన్ విజయవంతంగా నిర్వహిస్తున్నదన్నారు ఇవాళ మంచిర్యాల, రామగుండం, జగిత్యాల, వనపర్తి, నాగర్‌కర్నూల్, మహబూబాబాద్, కొత్తగూడెం, సంగారెడ్డిలో ప్రారంభించుకుంటున్నాం. మహబూబాబాద్, వనపర్తిలాంటి మారుమూల ప్రాంతాల్లో ప్రభుత్వ కళాశాలలు, వైద్య కళాశాలలు వస్తాయని ఎవరూ కలలో ఊహించలేదు. వీటన్నింటికి కారణం సొంతరాష్ట్రం ఏర్పాటుకావడం. సొంత ఏర్పాటుతో ఉద్యమకారులుగా పని చేసిన బిడ్డలే తెలంగాణ పరిపాలనా సారథ్యం స్వీకరించడం, అందులో ప్రముఖ ఉద్యమకారుడు, మంత్రి హరీశ్‌రావు వైద్యారోగ్యశాఖను నిర్వహిస్తూ కళాశాలలను తీసుకువచ్చేందుకు చేసిన కృషి అపూరపమైందని, మంత్రి హరీశ్‌రావును అభినందించారు. మంత్రికి పూర్తిగా సహకరించిన సీఎస్, డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్ రమేశ్‌రెడ్డి, ఇతర వైద్య శాఖల అధికారులు, సిబ్బంది అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుతున్నట్లు చెప్పారు. ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ రావాలని మనం సంకల్పించుకున్నామని అన్నారు. ప్రభుత్వరంగంలో వచ్చే మెడికల్ కాలేజీ సంఖ్య 17కు పెరిగింది. జిల్లాల కవరేజీ స్తే 16కు వచ్చాం. ఇంకో 17 జిల్లాల్లో మెడికల్ కాలేజీలో ప్రారంభించుకోవాల్సి ఉంది. రాబోయే రోజుల్లో విశేష కృషి చేసి పూర్తి చేస్తామని కూడా భరోసా ఇచ్చారు. ఈ ఏడాది, వచ్చే సంవత్సరం 17 కాలేజీలను ప్రారంభించుకుందాం. భగవంతుడు మన్నిస్తే నేనే వాటికి ప్రారంభోత్సవం చేస్తానని అన్నారు. గతంలో 850 మెడికల్ సీట్లు ప్రభుత్వ కాలేజీల్లో ఉండేవి. ప్రస్తుతం ఎకాఎకీన 2,790 సీట్లకు పెరిగింది. ఇప్పటి వరకు దాదాపు నాలుగు రెట్లు సీట్లు పెరుగడం సంతోషం. పీజీ సీట్లు, సూపర్ స్పెషాలిటీ సీట్లు గతంలో పోలిస్తే గణనీయంగా పెంచుకోగలిగాం. గతంలో కేవలంలో రాష్ట్రంలో 515 పీజీ సీట్లు ఉంటే.. ఇప్పుడు 1180 సీట్లు అందుబాటులోకి వచ్చేవి. గతంలో సూపర్ స్పెషాలిటీ సీట్లు 70 మాత్రమే ఉంటే.. ప్రస్తుతం 152 వరకు అందుబాటులోకి వచ్చాయి. సీట్ల పెంపుతో విద్యార్థులకు మంచి అవకాశం దొరుకుతున్నాయని కెసిఆర్ అన్నారు. రెసిడెన్షియల్ కళాశాలల నుంచి వస్తున్న రత్నాల్లాంటి, వజ్రాలంటి విద్యార్థులు నీట్‌లో సీట్లు సాధిస్తున్నారు. ముఖ్యంగా దళిత, గిరిజన, బడుగు బలహీన బీసీ, మైనారిటీ వర్గాల పిల్లలకు ఇదో మంచి అవకాశం. ఇందుకు కృషి చేసిన రమేశ్‌రెడ్డికి, అధికారులకు ధన్యవాదాలు అంటూ ప్రకటించారు.. మెడికల్ సిబ్బంది, జనాభా నిష్పత్తికి సరితూగే డాక్టర్లు ఉండడం ఎంత అవసరమో దానికి తగు రీతిలో పారామెడికల్ సిబ్బంది, రెడియాలజిస్టులు, ల్యాబ్ టెక్నీషన్లు తదితర వైద్య సహాయక సిబ్బంది తగుమోతాదులో ఉండాలన్నారు దాన్ని కూడా నిర్లక్ష్యం చేకుండా ఉండాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. సిబ్బంది నియామకానికి రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. 33 జిల్లాల్లోని మెడికల్ కాలేజీలు, నర్సింగ్ కళాశాలలు యూనిఫాంగా ఏర్పాటు చేయడం జరుగుతుంది. మిగతా పారామెడికల్ కోర్సులు అన్ని చోట్ల పెట్టకపోయినా.. వరంగల్ లాంటి ప్రముఖ ప్రాంతాలు, ఇతర ప్రాంతాల్లో ఒక్కో ప్రాంతంలో ఒక్క కోర్సు ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. తెలంగాణలో ఏ మారుమూల అయినా మనదే. యావత్ తెలంగాణ అభ్యుదయం జరగాలన్నదే తన సంకల్పం అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు హరీష్ రావు, వేముల ప్రశాంతరెడ్డి సహా మాజీ స్పీకర్ మదుసూధానాచారి , వైద్యారోగ్య శాఖ అధికారులు, సిఎస్ సోమేశ్ కుమార్ కూడా పాల్గొన్నారు.

# ఆటో డ్రైవర్ ప్రాణాల మీదకు తెచ్చిన టీఆర్ఎస్

(మొదటి పేజి తరువాయి) తున్న ఆటోపై పడ్డాయి. క్షణంలో మంటలు అంటుకున్నాయి. ఈ మంటల్లో ఆటోడ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. ఒళ్లంతా కాలిన గాయాలయ్యాయి. పక్కనే ఉన్న టీఆర్ఎస్ కార్యకర్తలు మంటలు ఆర్పడానికి ప్రయత్నించేసరికి పరిస్థితి చేయిదాటింది. పక్కనే బట్టల దుకాణం నుంచి శాలువాలను తీసుకొచ్చి అతడిపై కప్పారు. ప్రస్తుతం ఆటోడ్రైవర్ పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. తెలంగాణ వ్యాప్తంగా కొత్త మెడికల్ కాలేజీల సంబరం వేళ టీఆర్ఎస్ కార్యకర్తల అత్యుత్సాహంతో ఒకరు సీరియస్ కావడం విషాదం నింపింది. దీనిపై స్థానికులు టీఆర్ఎస్ నేతలపై మండిపడుతున్నారు. ఆటోడ్రైవర్ కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.




# చలన చిత్రం



# కృష్ణ మృతితో టాలీవుడ్‌లో విషాదం

**గురువారం షూటింగ్‌ల బందుకు నిర్ణయం**

**పశ్చిమగోదావరిలో థియేటర్లు బంద్ చేసి నివాళి**

**నివాళి అర్పించిన నటుడు బాలకృష్ణ**

సూపర్ స్టార్ కృష్ణ మృతితో టాలీవుడ్ ఇండస్ట్రీలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆదివారం అర్ధరాత్రి గుండెపోటుతో హైదరాబాద్‌లోని కాంటినెంటల్ హస్పిటల్‌లో చేరిన ఆయన.. చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున కన్నుమూశాడు. కృష్ణ మృతితో ఘట్టమనేని ఫ్యామిలీ శోకసంద్రంలో మునిగిపోయింది. ఆయన మరణం పట్ల సినీ సెలబ్రెటీలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలంటూ సోషల్ మీడియా వేదికగా నివాళులు అర్పిస్తున్నారు. ఇక కృష్ణ మృతి పట్ల నిర్మాతల మండలి సంతాపం ప్రకటించింది. సంతాప సూచకంగా గురువారం షూటింగ్‌లకు సెలవు ప్రకటించింది. ఇక కృష్ణ మృతికి పశ్చిమ గోదావరి జిల్లా వాసులు ఘన నివాళి అర్పించారు. కృష్ణ అకాల మృతికి సంతాపంగా పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా థియేటర్‌లో ఉదయం ఆటలను రద్దు చేసినట్లు జిల్లా డిస్ట్రిబ్యూటర్‌లు, ఎగ్జిబ్యూటర్‌లు తెలిపారు. ఇకపోతే బాలకృష్ణ తాజాగా నటిస్తున్న వీరసింహా రెడ్డి బృందం కృష్ణ మృతికి నివాళులు అర్పించింది. ప్రస్తుతం ఈ చిత్రం అనంతపూర్‌లో షూటింగ్ జరుపుకుంటుంది. కాగా షూటింగ్ లోకేషన్‌లో చిత్ర యూనిట్ కృష్ణ చిత్రపటాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం దర్శకుడు గోపిచంద్, కన్నడ యాక్టర్ దునియా విజయ్‌లతో పాటు యూనిట్ సభ్యులు కృష్ణకు నివాళులు అర్పించారు. ఇక ఆయన మరణం పట్ల సంతాపం ప్రకటించారు. హీరో నందమూరి బాలకృష్ణ, కృష్ణ మరణంపై తెలుగు సినీ వినీలాకాశంలో మరో ధృవతార చేరింది అంటూ సోషల్ మీడియా వేదికగా ఎమోషనల్ అయ్యాడు.




## తొలి కౌబాయ్ చిత్రం మోసగాళ్లకు మోసగాడు

**సూపర్ డూపర్ విజయం అందుకున్న మూవీ**

తెలుగు ఇండస్ట్రీలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన హీరో కృష్ణ. ప్రయోగాలకు ఎప్పుడూ ఆయన ముందే ఉంటారు. కేవలం హాలీవుడ్ కు మాత్రమే పరిమితమైన కౌబాయ్ తరహా చిత్రాలను టాలీవుడ్ కు పరిచయం చేసిన ఘనత ఆయనకే దక్కుతుంది. ఇప్పుడు మనం గర్వంగా చెప్పుకుంటున్న పాన్ ఇండియా మూవీని ఆయన 50 ఏళ్ల క్రితమే చేశారు. ఇంగ్లీష్ సినిమాల స్ఫూర్తితో 1971లో మోసగాళ్ళకు మోసగాడు అనే సినిమాను రూపొందించారు. ఇంగ్లీషులో విజయం సాధించిన మెకానస్ గోల్డ్ తరహాలో ఈ సినిమాను నిర్మించారు. ఈ సినిమా తమిళ్ తో పాటుగా హిందీలో 'ఖజానా', ఇంగ్లీష్ లో 'ది ట్రెజర్' టైటిళ్లతో రిలీజై సూపర్ హిట్‌అయింది. అప్పట్లోనే 125 దేశాల్లో రిలీజైన తొలి భారతీయ సినిమాగా మోసగాళ్లకు మోసగాడు రికార్డు క్రియేట్ చేసింది. కె.ఎస్.ఆర్.దాస్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో కృష్ణ సరసన విజయనిర్మల హీరోయిన్ గా నటించారు. పద్మాలయా స్టూడియోస్ పై ఆదిశేషగిరిరావు ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ సినిమాతో కృష్ణను తెలుగు ప్రేక్షకులు ఆంధ్రా జేమ్స్‌బాండ్ అని పిలవడం మొదలు పెట్టారు



## ఆసుపత్రిలోనే నాగశౌర్య

టాలీవుడ్ యువ హీరో నాగశౌర్య సినిమా షూటింగ్‌లో కళ్లు తిరిగి పడిపోయారు. చికిత్స కోసం వెంటనే దగ్గరలోని ఏఐజీ ఆసుపత్రికి తరలించారు. అయితే నాగ శౌర్య ఇంకా హాస్పిటల్ లోనే ఉన్నారని తెలుస్తోంది. ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో చికిత్స తీసుకొంటున్నారు. అతని ఆరోగ్యం ఇప్పుడు బాగానే ఉందని.. త్వరలోనే డిశ్చార్జ్ అవుతారని సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. శౌర్య తన కొత్త సినిమాలో పాత్ర కోసం తీవ్రంగా వర్కౌట్స్ చేస్తూ పర్ఫెక్ట్ బాడీని రెడీ చేస్తున్నాడు. ఇందులో కొన్ని యాక్షన్ సన్నివేశాల్లో సిక్స్ ప్యాక్ బాడీని చూపించాల్సి ఉండగా.. సోమవారం షూటింగ్ లో వాటిని ప్లాన్ చేశారట. దీని కోసం గత మూడు నాలుగు రోజులుగా లాలాజలం మాత్రమే మింగుతూ కనీసం నీళ్లు కూడా తీసుకోలేదట. దీంతో నాగశౌర్య సెట్ కి వచ్చినప్పుడే కాస్త అలసటగా కనిపించారట. ఈ క్రమంలోనే యాక్షన్ సీన్ షూట్ చేయాల్సిన సమయంలో కళ్లు తిరిగి పడిపోయారని.. హుటాహుటిన స్థానిక ఆసుపత్రికి తరలించారని సన్నిహితులు చెబుతున్నారు. నాగ శౌర్యకు వైరల్ ఫీవర్ ఎటాక్ అయినట్లు డాక్టర్స్ తెలిపారు. ఇప్పటికీ కాస్త నీరసంగానే ఉన్నారని తెలుస్తోంది. గతంలో 'లక్ష్య' సినిమా టైంలోనూ శౌర్య తన పాత్ర కోసం చాలా కష్టపడ్డాడు. కొన్ని సీక్వెన్స్ లో తన బాడీని ప్రదర్శించడానికి పర్ఫెక్ట్ డైట్ ని ఫాలో అయ్యాడు. అప్పుడు కూడా కొన్ని రోజుల పాటు నీళ్లు తాగకుండా ఉన్నాడని అంటున్నారు. నాగశౌర్య తన బ్యాచిలర్ లైఫ్ కి గుడ్ బై చెప్పి నవంబర్ 20న ఓ ఇంటివాడు కాబోతున్నాడు. బెంగుళూరుకు చెందిన అనూష శెట్టితో శౌర్య వివాహం జరగబోతోందని ఈ మధ్యనే అధికారికంగా ప్రకటించి వెడ్డింగ్ కార్డుని షేర్ చేసారు. బెంగుళూరులో గ్రాండ్ గా వివాహ వేడుకకు అన్ని ఏర్పాట్లు జరుగుతున్న సమయంలో శౌర్య అస్వస్థతకు గురవ్వడంతో అందరూ ఆందోళన చెందారు. అయితే అప్పటికి యువ హీరో కోలుకుని ఫార్మాలిటీస్ పూర్తి చేస్తారని సన్నిహితులు అంటున్నారు.



## ముంబై బిజినెస్మేన్‌తో తమన్నా పెళ్లి

**అవన్నీ గాసిప్స్ అంటూ తోసిపుచ్చిన మిల్క్ బ్యూటీ**

మిల్కీబ్యూటీ తమన్నా పెళ్లి వార్త కొన్ని రోజులుగా నెట్టింట హాట్ టాపిక్ గా మారిన సంగతి తెలిసిందే. ఏడాది ఆరంభం నుంచి తమన్నా పెళ్లిపై కథనాలు అంతకంకు హీటెక్కిస్తున్నాయి. పెళ్లి కోడుకు వివరాలు బయటకు రాలేదుగానీ..మిల్కీ పెళ్లాడేస్తుంది..పిలల్ని కనేస్తుందంటూ ఒకటే దంపుడు మొదలైంది. ఏప్రిల్ నుంచి అక్టోబర్ నెలవరకూ పెళ్లిపై నిత్యం కథలనాలు వైరల్ అవుతూనే ఉన్నాయి. దీంతో తమన్నా అప్పుడున్న పరిస్థితుల్లో సీన్లోకి రాక తప్పలేదు. మీడియా కథనాలకి తగ్గట్లు ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేసింది. పెళ్లి విషయంలో తనకు కొన్ని కలలు ఉన్నాయని.. అందరి అమ్మాయిల్లా పెళ్లి చేసుకొని పిల్లల్ని కనాలని ఉందని రివీల్ చేసింది. కుటుంబ సభ్యుల నుంచి కూడా పెళ్లి విషయంలో ఒత్తిడి మొదలైందని నవ్వేసింది. అయితే పెళ్లి ఎప్పుడనే నిర్ణయాన్ని మాత్రం తనకే వదిలివేశారని క్లారిటీ ఇచ్చింది. బిజీ షెడ్యూల్స్ కారణంగా పర్సనల్ లైఫ్ గురించి ఆలోచించే తీరిక లేకపోవడంతో వివాహం గురించి సీరియస్ గా ఆలోచన చేయలేకపోతున్నట్లు తెలిపింది. కేవలం మీడియాలో వస్తోన్న గాపిప్స్ నేపథ్యంలోనే ఈ రకమైన వివరణ ఇచ్చింది. అయితే తాజాగా అమ్మడి పెళ్లి ముంబైకి చెందని ఓ బడా వ్యాపార వేత్తతో కుదిరినట్లు కథనాలు ఊపందుకున్నాయి. ఇది పెద్దలు కుదర్చిన సంబంధం అని..కుర్రాడు బ్యాక్ గ్రౌండ్ కూడా బాగుండటంతో తమన్నా ఒకే చెప్పిందని కోలీవుడ్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం సాగుతోంది. నిశ్చితార్థం..పెళ్లి ముహూర్తాలు చూడటమే ఆలస్యమని గట్టిగానే వినిపిస్తుంది.



## నటవారసుడిగా పేరు తెచ్చుకున్న మహేశ్ బాబు

**10 చిత్రాల్లో కలిసి నటించిన కృష్ణ, మహేష్ బాబు**

సూపర్ స్టార్ కృష్ణ నటవారసుడిగా ప్రిన్స్ మహేష్ బాబు పేరు తెచ్చుకున్నారు. అంతేకాదు తండ్రికి తగ్గ తనయుడు అని చాలాసార్లు నిరూపించుకున్నారు కూడా. తండ్రీ, కొడుకులు సినీ ఇండస్ట్రీలో ఉన్నా.. ఇద్దరూ కలిసి నటించే సినిమాలు చాలా తక్కువే ఉంటాయి. కానీ కృష్ణ, మహేష్ బాబు కలిసి 10 చిత్రాల్లో నటించడమే కాకుండా..అవన్నీ కూడా బాక్సాఫీస్ వద్ద మంచి హిట్ కొట్టినవే కావడం చెప్పుకోదగిన విషయం. కృష్ణ వారసుడిగా ఫిల్మ్ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టినా..ఆ తర్వాత మహేష్ చేసిన సినిమాలు ఆయనకు స్పెషల్ ఇమేజ్ ను తెచ్చిపెట్టాయి. ఇక తండ్రీ, కొడుకులిద్దరూ కలిసి నటించిన విషయానికొస్తే.. మహేష్ బాలనటుడిగా 7 చిత్రాల్లో నటించగా.. హీరో అయ్యాక మరో 3 మూవీస్ లో నటించారు. తండ్రి సూపర్ స్టార్ కృష్ణతో మహేష్ బాబు చిన్నప్పటి నుంచే పలు చిత్రాల్లో నటించడం ప్రారంభించారు. అందులో ఎక్కువగా తన తండ్రి స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన సినిమాల్లో నటించడం గమనార్హం.కోడి రామకృష్ణ దర్శకత్వంలో.. వచ్చిన పోరాటం సినిమాలో అన్నదమ్ములుగా, కృష్ణ స్వీయ దర్శకత్వంలో... తండ్రీ, తనయులుగా శంఖారావం చిత్రంలో నటించారు. కోదండ రామిరెడ్డి దర్శకత్వంలో బజారు రౌడీ మూవీలో... కృష్ణ ఫ్యాన్‌గా మహేష్ కనిపించాడు. ముగ్గురు కొడుకులు చిత్రంలో మహేష్ బాబు అన్న రమేష్ బాబు కూడా యాక్ట్ చేసారు. ఈ చిత్రాన్ని కూడా కృష్ణ దర్శకత్వంలో తెరకెక్కింది. ఈ సినిమా కూడా బాక్సాఫీస్ దగ్గర సూపర్ హిట్‌గా నిలిచింది. ఈ సినిమాలో కృష్ణకు తమ్ముళ్లుగా ఆయన తనయులు రమేష్ బాబు, మహేష్ బాబు సోదరులుగా నటించడం విశేషం. టక్కరి దొంగ చిత్రంలో సూపర్ స్టార్ కృష్ణ, మహేష్ బాబుతో పాటు నమ్రత కూడా కలిసి నటించడం విశేషం. మొత్తంగా తండ్రీ తనయులు కాకుండా కోడలు కూడా ఈ సినిమాలో భాగస్వామి కావడం విశేషం.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **GPR PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
TITLE CODE.TELTEL02057, Cell:8464816456 Email: aksharavelugudaily@gmail.com, Website: www.aksharavelugu.com